# డబుల్ బెడ్‌రూమ్ గుట్టురట్టు...!

- మూడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విక్రయం..!
- మరో మూడు అమ్మకానికి సిద్ధం....?
- ప్రజా జ్యోతి కథనంతో కదిలిన "స్పెషల్ బ్రాంచ్"
- అమ్మకం, కొనుగోళ్లపై చాప కింద నీరులా విచారణ...

2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 7 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 9

# "గౌరవం లేని చోట.. ఉండలేను..!"





- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ.. రెండుసార్లు విజయం
- బీఆర్ఎస్‌లో సీనియర్ నేతనైనా ఇప్పటికీ అధికారిక హోదా లేదు..
- "విలువలతో కూడిన రాజకీయమే చేశా.. సాధారణ కార్యకర్తగానే పనిచేశా"
- మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కీలక వ్యాఖ్యలు..
- నియోజకవర్గంలో పెరిగిన రాజకీయ ఉత్కంఠ!

9 లో..

"నేను ఇప్పటివరకు విలువలతో కూడిన రాజకీయాలే చేశాను. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశాను. రెండుసార్లు గెలిచాను.. రెండుసార్లు ఓడిపోయాను. రాజకీయంగా ఇంత సీనియర్ నాయకుడినైనా ఇప్పటివరకు బీఆర్ఎస్‌లో నాకు అధికారికంగా ఎలాంటి హోదా లేదు. అయినా సాధారణ కార్యకర్తగానే పార్టీ కోసం పనిచేశాను. కానీ గౌరవం లేని చోట నేను ఉండలేను.." అంటూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు చేసిన వ్యాఖ్యలు అశ్వారావుపేట రాజకీయాల్లో సంచలనంగా మారాయి.

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి / ములకలపల్లి, ప్రజాజ్యోతి



# పాల్వంచ కస్తూరిబా పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- ▶ విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి
- ▶ జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 6, (ప్రజాజ్యోతి)** పాల్వంచ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అందుతున్న విద్యా బోధన, నీట్ కోచింగ్, విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ, మౌలిక వసతులు, భోజన సదుపాయాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ ముందుగా ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల హాజరు నమోదును పరిశీలించారు. పాఠశాలలో బోధనా కార్యక్రమాలు సక్రమంగా కొనసాగుతున్నాయా, ఉపాధ్యాయుల హాజరు ఎలా ఉంది, విద్యార్థుల హాజరు శాతం ఎంత అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న

మిగతా 2 లో...

# సుజాతనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**సుజాతనగర్, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):** కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మంగళవారం సుజాతనగర్ మండల పరిధిలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దీనికిగాను రూ.5.50 కోట్లతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో

మిగతా 2 లో...

# కుళ్లిన గుడ్లపై సీడీపీవో వివరణ!

- ఇకపై గుడ్లు వచ్చిన వెంటనే పరిశీలన.. నాణ్యత నిర్ధారించిన తర్వాతే పిల్లలకు పంపిణీ
- అంగన్వాడీ టీచర్లకు ఆదేశాలు.. ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారనే ఆరోపణలపై నోటీసులు
- పోషకాహార పంపిణీపై నిరంతర పర్యవేక్షణకు హామీ



## ప్రజా జ్యోతి ఎఫెక్ట్..

**అశ్వారావుపేట, ప్రజాజ్యోతి, అక్టోబర్ 6** అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పంపిణీ చేస్తున్న కుళ్లిన గుడ్లపై 'ప్రజా జ్యోతి'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. కథనం వెలువడిన నేపథ్యంలో సీడీపీవో ముత్తమ్మ వివరణ ఇస్తూ.. ఇకపై అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గుడ్లను ముందుగానే పరిశీలించి, నాణ్యతను నిర్ధారించిన తర్వాతే చిన్నారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**గుడ్లు వచ్చినప్పుడే తనిఖీ**

అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు వచ్చిన వెంటనే వాటిని పరిశీలించి, పర్యవేక్షణ చేసిన అనంతరం మాత్రమే పిల్లలకు అందజేయాలని అంగన్వాడీ టీచర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు సీడీపీవో తెలిపారు. కుళ్లిన లేదా నాణ్యత లేని గుడ్లు చిన్నారులకు

మిగతా 2 లో...

## సుజాతనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



(మొదటి పేజీ తరువాయి...)

భాగంగా సీసీ రోడ్లు, రోడ్డు నిర్మాణం తదితర పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా డివిజన్ నంబర్ 23 నర్సింహసాగర్‌లో సీసీ డ్రెయిన్, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం డివిజన్ నంబర్ 23 మంగపేటలో సీసీ డ్రెయిన్, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. డివిజన్ నంబర్ 20 లక్ష్మీదేవిపల్లిలో సీసీ డ్రెయిన్, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. సుజాతనగర్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, మధ్యాహ్నం డివిజన్ నంబర్ 21 లెనిన్‌నగర్, నాయుడులగూడెం ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నాయుడులగూడెం, దేగలమడుగు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సాయంత్రం డివిజన్ నంబర్ 20 కోమటిపల్లిలో భూక్యా రామారావు–శివాలయం వరకు డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మాణానికి, డివిజన్ నంబర్ 20 నిమ్మలగూడెం గ్రామంలో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మేయర్ మూడు గణేష్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానికులు అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేశారు.

## పాల్వంచ కస్తూరిబా పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)



పరీక్షలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుకు పరీక్ష రాస్తున్నారో అడిగి తెలుసుకోగా, కెమిస్ట్రీ పరీక్ష నిర వ్రహిస్తున న్టట్లు విద్యార్థులు తెలిపారు. పరీక్షల అనంతరం విద్యార్థులకు నిర్వహిస్తున్న అధ్యయన కార్యక్రమాల గురించి కూడా కలెక్టర్ ఆరా తీశారు. నీట్ కోచింగ్‌లో భాగంగా విద్యార్థులకు సాయంత్రం 3.45 గంటల నుంచి 6.00 గంటల వరకు అదనపు బోధనా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం పాఠశాలలోని 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. చదువుపై ఆసక్తి, పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరు, తరగతుల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. పరీక్షలు పూర్తయిన అనంతరం తదుపరి పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదువుకోవడంతో పాటు పరీక్షలకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని సూచించారు. పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మొత్తం 355 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా ఆయన అడిగి తెలుసుకుని, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారి విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం విద్యాలయంలోని కిచెన్ షెడ్డును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ ఆహారం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించి, వాటి నాణ్యత, పరిమాణం, పరిశుభ్రతను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులు, కూరగాయలు, వంటగది పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. గత సంవత్సరం నాబార్డ్ నిధుల ద్వారా మంజూరైన నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు కిచెన్ షెడ్డును కూడా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల హాజరును మెరుగుపరచడంతో పాటు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా నిరంతరం మార్గనిర్దేశం చేయాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ గుట్టురట్టు...!



**భద్రాచలం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** పేదోడి సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వాలు డబల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ పేర్లతో ఇల్లులు నిర్మిస్తుంటే, అడ్డదారిలో సొంతం చేసుకున్న కొందరు ప్రబుద్ధులు వాటిని రియల్ ఎస్టేట్ వ్యాపారంలా అమ్ముకుంటున్నారు. పట్టణంలోని తొలివిడతగా 2018లో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో 88 డబల్ బెడ్ రూమ్ మంజూరు చేయగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో రెండో విడతగా మనుబోతుల చెరువు, కెసిఆర్ కాలనీలో కలిపి 119 డబల్ బెడ్ రూమ్ లో లబ్ధిదారులకు అందజేశారు. కాగా రెండో విడతలో కేసీఆర్ కాలనీ వద్ద మంజూరు చేసిన డబుల్ బెడ్ రూమ్లలో విపరీతమైన అవకతవకలు జరుగుతున్నాయి. లబ్ధిదారులు కి ప్రభుత్వం అందించిన డబుల్ బెడ్ రూమ్ లను రూ.4 లక్షల నుండి రూ.5 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే మూడు డబల్ బెడ్ రూములు విక్రయించినట్లు తెలుస్తుండగా మరొక మూడు డబుల్ బెడ్ రూములు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

**మూడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విక్రయం....!**
**మరో మూడు అమ్మకానికి సిద్ధం....?**



పేదవాడికి అందవలసిన ప్రభుత్వ ఫలం, అడ్డదారిలో సొంతం చేసుకున్న కొందరు ప్రబుద్ధులు వాటిని రియల్ ఎస్టేట్ గా మారుస్తున్నారు. ఇప్పటికే మూడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు విక్రయించినట్లు ఆరోపణలు వస్తుండగా, మరో మూడు ఇళ్లను విక్రయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఒక లబ్ధిదారి తమ డబుల్ బెడ్ రూమ్ రూ.5 లక్షలకు అమ్ముతామని, మీకు తెలిసిన వారికి అమ్మీ పెట్టినట్లయితే మీకు కమిషన్ ఇస్తామని, ఇరుగుపొరుగు లబ్ధిదారులతో విక్రయిదారుడు తెలుపుతున్నట్లు తెలుస్తుంది. పేదోడి ఇంటి కలను కొందరు ప్రబుద్ధులు ఈ విధంగా రియల్ ఎస్టేట్ కమిషన్ దందా మొదలు పెడుతున్నారు. అంతే కాకుండా సుమారు నాలుగు నుండి ఆరు డబల్ బెడ్ రూమ్ లు అద్దెలకు ఇచ్చారని తెలుస్తుండగా మరొక మూడు నుండి ఐదు డబుల్ బెడ్ రూములు అద్దెలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. రూ.3వేల నుండి రూ.4 వేల వరకు అదే వసూలు చేస్తున్నట్లు స్థానికులు మాట్లాడుకుంటున్నారు. అదేవిధంగా కొన్ని గదులు ఖాళీగా ఉండి తాళాలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాదిలో ఒకటి రెండుసార్లు అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజా జ్యోతి కథనంతో కదిలిన స్పెషల్ బ్రాంచ్**

డబల్ బెడ్ రూములు అమ్మకాలు కొనుగోలు పై ప్రజాజ్యోతి లో వెలువడిన కథనంతో అధికార యంత్రాంగం కదిలింది. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, వాటి విక్రయాలు, కొనుగోళ్లపై స్పెషల్ బ్రాంచ్ అధికారులు చాప కింద నీరులా విచారణ చేపట్టినట్లు సమాచారం. ఇప్పటికే చేతులు మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇళ్ల వివరాలతో పాటు, విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న ఇళ్లపై కూడా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా డబల్ బెడ్ రూమ్ లో ఉంటున్న వారి వివరాలతో పాటు అదే ఇంటి విద్యుత్తు మీటర్ వివరాలను గమనించాల్సిన అవసరం ఉంది. ఏది మారిన విద్యుత్ మీటర్ పై పేరు మారే ప్రసక్తి లేకపోవడంతో క్రయం పొందిన వారు దొరికే అవకాశం ఉంటుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పొందిన లబ్ధిదారులు వాటిని ఇతరులకు విక్రయించడం చట్టబద్ధమేనా...! ఇళ్లను కొనుగోలు చేస్తున్న వారు ఎవరు...! విక్రయాల వెనుక మధ్యవర్తులు ఎవరైనా ఉన్నారా..! ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇల్లు చేతులు మారుతున్నాయా? అనే కోణాల్లో వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

## లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సహించం

- **విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**
- **సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్**

**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 6, ప్రజా జ్యోతి :** లంబాడీ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఎస్టీ హోదాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ డిమాండ్లు చేయడం సరికాదని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు గిరిజన సమాజంలో విభేదాలు, విద్వేషాలను పెంచేలా ఉన్నాయని పేర్కొన్నారు. సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వెంకటేష్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లంబాడీలకు లభిస్తున్న ఎస్టీ హోదా రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఆయన పేర్కొన్నారు. ఒక సామాజిక వర్గాన్ని పదేపదే లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సమాజంలో అనవసర ఉద్రిక్తతలకు దారితీస్తుందని అన్నారు. లంబాడీ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ప్రజాస్వామ్య, రాజ్యాంగ పద్ధతుల్లో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించేలా, విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించే వ్యక్తులు, సంస్థలపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య శాంతి, సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అసత్య ప్రచారాలతో సామాజిక ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, కిరణ్ నాయక్, భరత్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కుళ్లిన గుడ్లపై సీడీపీవో వివరణ!

(మొదటి పేజీ తరువాయి...)

చేరకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**పోషకాహారంపై నిరంతర పర్యవేక్షణ**

గుడ్లతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఇతర పోషకాహార పదార్థాల పంపిణీపై కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తామని సీడీపీవో ముత్తమ్మ హామీ ఇచ్చారు. పిల్లలకు అందాల్సిన ఆహార పదార్థాలు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారనే ఆరోపణలపై నోటీసులు**

మధ్యాహ్న సమయంలో కొంతమంది అంగన్వాడీ టీచర్లు పిల్లలను కేంద్రాల్లోనే ఉంచి ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. సంబంధిత ఆరోపణలపై నోటీసులు జారీ చేస్తామని సీడీపీవో తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఇకపై పునరావృతం కాకుండా చర్యలు**

అంగన్వాడీ కేంద్రాల్లో కుళ్లిన గుడ్లు పంపిణీ వంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని సీడీపీవో ముత్తమ్మ హామీ ఇచ్చారు. పిల్లలకు అందాల్సిన పోషకాహార విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.

**హామీలు అమలయ్యేనా?**

అధికారుల స్పందనతో సమస్యపై పర్యవేక్షణ పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అయితే అధికారులు ఇచ్చిన హామీలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతాయన్నది ఇప్పుడు కీలకంగా మారింది. గుడ్ల నాణ్యత, పోషకాహార పంపిణీ, అంగన్వాడీ సిబ్బంది సమయపాలనపై నిరంతర పర్యవేక్షణ ఉంటేనే ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. 'ప్రజా జ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు.. ఇకపై చర్యలు ఎంతవరకు కఠినంగా ఉంటాయో, అంగన్వాడీ కేంద్రాల్లో పరిస్థితులు ఎంతవరకు మారుతాయో వేచి చూడాలి.

# కోతులు.. కుక్కలతో జనం బెంబేలు

- జిల్లాలో పలువురిపై దాడులు చేసిన వైనం
- బయటకు రావాలంటే జంకుతున్న ప్రజలు
- ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠ
- పిల్లలు, వృద్ధులను టార్గెట్ చేస్తున్న వైనం
- ఇళ్లలోకి చొరబడుతున్న వానరాలు
- రోడ్లపై కుక్కలతో నరక యాతన
- ఇంట్లో వస్తువులను ఎత్తుకెళ్తున్న కోతులు
- పిల్లలు, వృద్ధులపై దాడులతో ఆందోళన
- కట్టడి చేయాలని ప్రజల వేడుకోలు





**ఇల్లందు, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి)** ఇల్లందు పట్టణంలో కోతులు, వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు, ఇళ్ల పరిసరాల్లో తిరుగుతున్న కోతులతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఒంటరిగా రోడ్లపైకి వెళ్లేందుకు భయపడుతున్న పరిస్థితి నెలకొంది.

### ఇళ్లలోకి చొరబడుతున్న వానరాలు

పట్టణంలోని పలు కాలనీల్లో కోతులు ఇళ్లలోకి చొరబడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. తలుపులు, కిటికీలు తెరిచి ఉంటేచాలు.. ఇళ్లలోకి ప్రవేశించి ఆహార పదార్థాలతో పాటు ఇతర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని చెబుతున్నారు. వాటిని తరిమికొట్టే క్రమంలో కోతులు దాడికి దిగుతుండటంతో ప్రజలు మరింత భయపడుతున్నారు.

### పిల్లలు, వృద్ధులే లక్ష్యంగా..

కోతులు, కుక్కల బెడదలో ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై ఒంటరిగా వెళ్లే పిల్లలను కుక్కలు వెంబడించడం, కోతులు భయపెట్టడం వంటి ఘటనలతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఎటు వైపు నుంచి దాడి జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్లపై కుక్కలతో నరకయాతన

పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీ వీధులు, ఖాళీ ప్రదేశాల్లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. వాహనదారులను వెంబడించడం, ద్విచక్ర వాహనాల వెంట పరుగులు తీయడం, పాదచారులపైకి దూసుకురావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

### జిల్లాలో పలువురిపై దాడులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత కొన్ని నెలల నుండి ఏదో ఒక పట్టణం, గ్రామాల్లో ఇటు కోతులు.. అటు కుక్కల దాడిలో ఎంతోమంది ఇబ్బందులు పడ్డారు. చిన్నారుల నుండి వృద్ధుల వరకు కోతులు, కుక్కల దాడిలో గాయపడిన వారెందరో ఉన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో కోతులు, కుక్కలు దాడి చేసిన ఘటనకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కోతులు, కుక్కలను నివారించడంలో విఫలం చెందుతున్నారనే అపవాదు లేకపోలేదు. నిత్యం ఏదో ఒకచోట కోతులు, కుక్కలు జనంపై భౌతిక దాడులకు పాల్పడుతున్నప్పటికీ ఇటు అధికారులు.. అటు పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇదే తంతు కొనసాగితే ఇక ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు ఇకనైనా స్పందించి కోతులు, కుక్కల సంచారాలకు అడ్డుకట్ట వేయాలని, లేనియెడల ఇంకా మరెందరో వాటి బారిన పడి మరింత ఇబ్బందులు పడే పరిస్థితి లేకపోలేదని జనం పేర్కొంటున్నారు. ఆ దిశగా అధికారులు, పాలకులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు కోరుతున్నారు.

### ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయం

కోతులు, కుక్కల బెడదతో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపిల్లలను బయటకు పంపాలన్నా, వృద్ధులు ఒంటరిగా నడవాలన్నా కుటుంబ సభ్యులు భయపడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

### అధికారులు స్పందించాలని డిమాండ్

కోతులు, వీధి కుక్కల సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. కుక్కలను నియంత్రించడంతో పాటు, కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీల్లో ప్రత్యేక బృందాలతో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోవాలి. ప్రజల భద్రతకు సంబంధించిన ఈ సమస్యపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు. కోతులు, కుక్కల దాడులతో ప్రాణ నష్టం లేదా గాయాలు సంభవించిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పట్టణ ప్రజలకు భయరహిత వాతావరణం కల్పించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వ్యవసాయ మార్కెట్ ఆదాయాన్ని పెంచాలి



**ఇల్లందు, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి)** ఇల్లందు వ్యవసాయ మార్కెట్ ఆదాయాన్ని పెంచాలని, అందుకు పాలకవర్గం, సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా తిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. మార్కెట్ పరిధిలో టేకులపల్లి సబ్ యార్డ్ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, కామేపల్లి మండలంలో నూతన సభ్యులు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, వైస్ చైర్మన్ బిజ్జా వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, డైరెక్టర్లు కుంజా వసంత రావు, జారే సమ్మక్క, బొల్లి రాజు, గుగులోత్ గబ్రు, మాలోత్ బావు సింగ్, భూక్య శివలాల్ నాయక్, బానోత్ జింకు, ఊకె బుచ్చయ్య, జిగట వెంకన్న, మార్కెట్ జెయంఎస్ పిక్లా నాయక్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**ఇల్లందు, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి)** టేకులపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న చదువు, విద్యా సౌకర్యాలు, కళాశాలలో సమస్యలను మెరుగు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానని స్పష్టం చేశారు.

## పీహెచ్‌సీని సందర్శించిన అడిషనల్ డీఎంహెచ్ఓ

**చర్ల, అక్టోబర్ 6(ప్రజా జ్యోతి):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎం&హెచ్ఓ డాక్టర్ సైదులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ప్రజారోగ్యంపై పలు సూచనలు చేశారు.కీటకాల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా గర్భిణీలను చైతన్యపరచాలని, సంస్థాగత ప్రసవాల ప్రాధాన్యతను తెలియజేయాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును తప్పనిసరిగా ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు.అలాగే ప్రతి అనుమానిత టీబీ కేసులో కఫ నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించాలని, నమోదైన ప్రతి టీబీ కేసును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ తదితర సంక్రమించని వ్యాధుల (ఎన్‌సీడీ) పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక, హోమియోపతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూజ, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ స్ఫూర్తి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రామ్ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై అశ్వారావుపేట పోలీసుల మెరుపు దాడి

- ఆరుగురు అదుపులో.. రూ.8,100 నగదు, పేకముక్కలు, వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం




**అశ్వారావుపేట, ప్రజా జ్యోతి అక్టోబర్ 6:** అశ్వారావుపేట మండలంలో పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో అశ్వారావుపేట పోలీసులు నారం వారి గూడెం కాలనీ గ్రామ శివారులోని చెరువు సమీపంలో ఉన్న ఖాళీ స్థలంపై దాడి చేశారు.అశ్వారావుపేట ఎస్ఐ టీ. యయాతీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నారం వారి గూడెం కాలనీ గ్రామ శివారులోని చెరువు దగ్గర ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సమాచారం ఆధారంగా పోలీసులు అక్కడికి చేరుకుని ఆకస్మికంగా దాడి నిర్వహించారు.పోలీసుల రాకను గమనించినప్పటికీ అక్కడి నుంచి తప్పించుకునే అవకాశం లేకపోవడంతో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.అదేవిధంగా పేకాట స్థావరానికి వచ్చిన వారి వద్ద ఉన్న 4 మోటార్‌సైకిళ్లు, 5 మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న వస్తువులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేకాట స్థావరాల నిర్వహణకు పాల్పడుతున్నా, పేకాట ఆడుతున్నా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలకు ఎక్కడైనా పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అశ్వారావుపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని ఎస్ఐ యయాతీ రాజు తెలిపారు.

## మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో శానిటేషన్ కార్యక్రమాలు

- పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- పాడుపడిన బావిలో బ్లీచింగ్ పౌడర్ చల్లింపు
- సర్పంచ్‌తో పాటు కార్యదర్శి తరుణ్ ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు
- గ్రామ రహదారుల శుభ్రత, శానిటైజేషన్ చేపడు తున్న పంచాయతీ సిబ్బంది



**పినపాక,అక్టోబర్ 06(ప్రజాజ్యోతి )**మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ పాలకవర్గం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించా రు. సర్పంచ్‌తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి తరుణ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామంలోని పలు ప్రాంతాల్లో శానిటేషన్ కార్యక్రమాలను చేపడుతున్నారు.గ్రామంలోని రహదారులు, వీధులు, పరిసర ప్రాంతాలను శుభ్రం చే యడంతో పాటు అవసరమైన చోట్ల శానిటైజేషన్ చర్యలు చేపడుతున్నారు. రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగిస్తూ గ్రామాన్ని పరిశుభ్రం గా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పాడుపడిన బావిలో బ్లీచింగ్ పౌడర్ చల్లింపుగ్రామపంచాయతీ పరిధిలో పాడుపడిన బావిని గుర్తించి అందులో బ్లీచిం గ్ పౌడర్ చల్లారు. దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్ష ణ సర్పంచ్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శి తరుణ్ పారిశుధ్య పనులను పర్యవేక్షి స్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తున్నారు. గ్రామంలోని అన్ని ప్రాం తా ల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ శానిటేషన్ కార్యక్రమాలను కొనసాగిస్తున్న ట్లు పంచాయతీ వర్గాలు తెలిపాయి. గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ఏజెన్సీ ఏరియా లో 1/70 చట్టంను పకడ్బందీ గా అమలు చేయాలి

- పరిమిషన్ లేని బహుళ అంతస్తుల భవనం పై చటపరమైన చర్య లు తీసుకోవాలని డిమాండ్
- సెవాలాల్ బంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్

**లక్ష్మీదేవిపలి, 06-10-2026,(ప్రజాజోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలెక్టర్ ప్రజావాణిలో ఏజెన్సీ ఏరియా 1 / 70 యాక్టు పకడ్బందీ గా అమలు చేయాలని DRDO విద్య చందన మేడం గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సమావేశంలో సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలు తుంగలో తొక్కుతున్నారని చుంచుపల్లి మండలం లో విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ పంచాయతీ సెక్రటరీ కి ఎన్నోసార్లు G+3 మరియు G+4 బహుళ అంతస్తులు పర్మిషన్ లేకుండానే నిర్మాణం చేస్తున్నారని ఎన్నోసార్లు ఫిర్యాదు చేయడం జరిగింది అయినా కూడా చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ఏజెన్సీ ఏరియా 5 షెడ్యూల్ ప్రకారం 1 / 70 యాక్టు చట్టం చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ ఏజెన్సీ చట్టాలు తుంగలో తొక్కుతున్నారని విద్యానగర్ పెట్రోల్ బంకు ఆపోజిట్ v2 బహుళ అంతస్తు పై జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి పత్రం విద్య చందన మేడం గారికి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సేవా లాల్ బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు నూనావత్ రాంబాబు నాయక్, అనిల్ నాయక్, రవి నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# జీవో 76 దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో నెంబర్ 76 కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన, స్క్రూటినీ, రికమండేషన్, డిమాండ్ నోటీసుల జారీ, చెల్లింపులపై కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్యతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.జీవో 76 కింద జిల్లాలో మొత్తం 4,031 దరఖాస్తులు ఉండగా, 2,267 దరఖాస్తులకు స్క్రూటినీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన దరఖాస్తులపై విచారణ, సంబంధిత రెవెన్యూ రికార్డుల పరిశీలన పూర్తి చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే రికమండ్ చేసిన దరఖాస్తులను కూడా సంబంధిత రికార్డుల ఆధారంగా మరోసారి పరిశీలించి అర్హతలను ధ్రువీకరించాలని కలెక్టర్ తెలిపారు. గతంలో చేపట్టిన ఫస్ట్ ఫేజ్, సెకండ్ ఫేజ్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, అధికారులు చేసిన విచారణ, సిఫారసులకు సంబంధించిన ఆధారాలను నిర్ధారించాలని ఆదేశించారు.ఇప్పటివరకు సుమారు 276 దరఖాస్తులకు డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. డిమాండ్ నోటీసులు జారీ చేసిన దరఖాస్తులు, చెల్లింపులు చేసిన లబ్ధిదారులు, సేల్ ఆర్డర్లు పూర్తయినవి, పట్టాలు జారీ అయిన కేసులను వేర్వేరుగా గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కొత్తగూడెం, ఇల్లందు ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.ఇప్పటికే పరిశీలన పూర్తయిన దరఖాస్తులను తదుపరి దశకు పంపడంతో పాటు, మిగిలిన దరఖాస్తులపై విచారణను వేగవంతం చేసి పెండెన్సీని తగ్గించాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధీకరించి, భవిష్యత్తులో ఎటువంటి సందేహాలకు తావులేకుండా చర్యలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన దరఖాస్తుదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.

## రోడ్డుపై మొసలి పిల్ల కలకలం.. యువత చొరవతో సురక్షితం



**బూర్గంపహాడ్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలో మంగళవారం ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది.ప్రధాన రహదారిపైకి ఓ మొసలి పిల్ల రావడంతో స్థానికులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. రోడ్డుపై వేగంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాల కింద పడి మొసలి పిల్లకు ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో స్థానిక యువత చాకచక్యంగా స్పందించారు.రోడ్డుపై సంచరిస్తున్న మొసలి పిల్లను గమనించిన గ్రామ యువకులు బబ్బు రాయుడు తదితరులు వెంటనే అక్కడికి చేరుకుని దానికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తగా పట్టుకున్నారు.అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మొసలి పిల్లను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు.అనంతరం అటవీ శాఖ అధికారులు మొసలి పిల్లను సురక్షిత ప్రాంతానికి తరలించి గోదావరి నదిలో వదిలిపెట్టారు.దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.మొసలి పిల్లకు ఎలాంటి హాని కలగకుండా రక్షించి అటవీ శాఖ అధికారులకు అప్పగించిన యువతను సారపాక డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ డి.కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ డి.కృష్ణ మాట్లాడుతూ.. అడవి జీవులు, వన్యప్రాణులు జనావాస ప్రాంతాల్లో కనిపించినప్పుడు వాటికి ఎలాంటి హాని తలపెట్టకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.వన్యప్రాణులు కనిపించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు స్వయంగా వాటిని పట్టుకునే ప్రయత్నం చేయకుండా అధికారులకు సమాచారం అందిస్తే వాటిని సురక్షితంగా రక్షించి తగిన ప్రాంతంలోకి తరలిస్తామని తెలిపారు.మొసలి పిల్లను రక్షించి అటవీ శాఖకు అప్పగించిన బబ్బు రాయుడు తదితర యువత చొరవను పలువురు స్థానికులు అభినందించారు.వన్యప్రాణుల సంరక్షణ పట్ల యువత చూపిన బాధ్యతాయుత వైఖరి ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సారపాక ఎఫ్ బీఓ జి.బాబురావు, సాండెల్లపాడు ఎఫ్ బీఓ బి. భీమ్ చందర్,కృష్ణసాగర్ ఎఫ్ బీఓ బి.ఉపేందర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే జారె

- విద్యుత్ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- అనారోగ్యంతో ఉన్న పలువురికి పరామర్శ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**దమ్మపేట,అక్టోబర్.06 (ప్రజాజ్యోతి ):** మంగళవారం దమ్మపేట మండలంలోని పట్వారిగూడెం, జగ్గారం, నాగుపల్లి గ్రామపంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని జారె అన్నారు.పట్వారిగూడెంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన కొండా వెంకటలక్ష్మి కుటుంబానికి, నాగుపల్లిలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మారగాని విజయ కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కుటుంబ సభ్యులకు అందజే



శారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.అనంతరం పట్వారిగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న గోళ్ల నారాయణను ఎమ్మెల్యే పరామర్శించారు. టీఎం గుంపులో కంటి శస్త్రచికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వగ్గెల ముత్యాలరావును కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బూరుగుగుంపులో ప్రమాదవశాత్తు కిందపడటంతో చేయి విరిగిన వార్డు సభ్యురాలు సోయం బాలనాగమణిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### ›› లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

నాగుపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేశారు. మారగాని నాగేశ్వరరావు, మట్టా రమణ, ఊకే రాజేష్, బొబ్బిలి శ్రీనివాసరావులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ పర్యటనలో విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, డీఈ బద్రుపవార్, ఏడీఈ వెంకటరత్నం, ఏఈ రమేష్, ఎల్ఐలు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, ఎస్ఎల్ఐ రత్నాజీ, బూర్గుల ప్రసాద్, సర్పంచులు కూరం అర్జున్‌రావు, వంకా జానకిరాముడు, ఇస్లావత్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు వాసం శ్రీనివాసరావు, బొల్లికొండ నాగేశ్వరరావు, కుంపటి వేణు, ఎస్. వెంకట్రావు, వాడె మారగాని నాగేశ్వరరావు, వెలివెల శ్రీను, తిరుపతి రావు,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు ఇంజంక్షన్ ఉన్నా..
# పట్టా మార్పు ఎలా?

- 1954లో కొనుగోలు.. రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదు
- అదే భూమిలో ఇల్లు.. మల్లన్న ఆలయం
- 1960లో పొగాకు బేరన్ల నిర్మాణానికి పంచాయతీ అనుమతి
- 2018లో కోర్టు వివాదం.. తాత్కాలిక ఇంజంక్షన్ ఉన్నా పట్టా మార్పులపై ప్రశ్నలు
- అప్పటి ఎమ్మార్వో ఎలాంటి ఆధారాలతో పట్టా మార్చారు..?
- ఇల్లున్న స్థలానికి వ్యవసాయ పట్టా ఎలా..?
- సమగ్ర విచారణకు డిమాండ్

**పినపాక, అక్టోబర్ 6(ప్రజాజ్యోతి)** దుగినేపల్లి గ్రామంలోని ఓ భూ వ్యవహారం రోజురోజుకూ పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. దశాబ్దాల క్రితమే కొనుగోలు చేసినట్లు కోర్టులో దాఖలైన పత్రాల్లో పేర్కొన్న భూమి.. రెవెన్యూ రికార్డుల్లో పాత యజమాని పేరు నమోదైనట్లు ఉన్నప్పటికీ, అనంతరం అదే భూమికి సంబంధించి పట్టా మార్పులు ఎలా జరిగాయన్నది చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా 2018లోనే ఈ భూమిపై న్యాయస్థానంలో వివాదం ఏర్పడి, పిటిషనర్‌కు అనుకూలంగా తాత్కాలిక ఇంజంక్షన్ ఉత్తర్వులు ఉన్నట్లు కోర్టు పత్రాలు సూచిస్తున్న నేపథ్యంలో.. ఆ తర్వాత చోటుచేసుకున్న రెవెన్యూ రికార్డుల మార్పులపై సమగ్ర విచారణ అవసరమని స్థానికులు కోరుతున్నారు.

### ›› 1954లోనే భూమి కొనుగోలు

భద్రాచలం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించిన I.A.No. 146/2018, O.S.No.156/2018 పత్రాల్లోని వివరాల ప్రకారం.. కందిమల్ల బుచ్చి లింగయ్య దాఖలు చేసిన కేసులో, ఆయన తండ్రి కందిమల్ల మాణిక్యం 1954లో సుంకర ముత్తయ్య నుంచి సదరు భూమిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు అనంతరం కందిమల్ల మాణిక్యం పేరు రెవెన్యూ రికార్డుల్లో స్వాధీనం/అనుభవదారు కాలమ్‌లో నమోదైనట్లు కూడా కోర్టు పత్రంలో ప్రస్తావన ఉంది.



### ›› వారిఇల్లులు కూడా ఉన్నాయి.. మల్లన్న ఆలయం కూడా ఉంది

భూమిని కొనుగోలు చేసిన అనంతరం కందిమల్ల మాణిక్యం ఆ స్థలంలో నివాసం ఏర్పరచుకున్నట్లు కోర్టు పిటిషన్‌లో వివరాలు ఉన్నాయి. హెచ్.నెం.1–6తో ఇల్లు నిర్మించుకోవడంతో పాటు అదే స్థలంలో మల్లన్న స్వామి ఆలయం, పశువుల కొట్టం ఉన్నట్లు పత్రాల్లో పేర్కొన్నారు.

### ›› 1960లో పొగాకు బేరన్లకు పంచాయతీ అనుమతి

1960లో కందిమల్ల మాణిక్యం దుగినేపల్లి గ్రామ సర్పంచ్‌కు దరఖాస్తు చేయగా, రెండు పొగాకు బేరన్లు నిర్మించేందుకు గ్రామపంచాయతీ అనుమతి ఇచ్చినట్లు కోర్టు పత్రాల్లో పేర్కొన్నారు. దీంతో ఆ భూమి వినియోగానికి సంబంధించిన పాత చరిత్రను రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

### ›› 2018లో కోర్టు వివాదం.. ఇంజంక్షన్ ఉత్తర్వులు

ఈ భూమికి సంబంధించి 2018లో O.S.No.156/2018 కేసు నమోదైనట్లు కోర్టు పత్రాలు చూపుతున్నాయి. దానికి అనుబంధంగా దాఖలైన I.A. No.146/2018లో పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించిన న్యాయస్థానం తాత్కాలిక ఇంజంక్షన్ మంజూరు చేసినట్లు పత్రాల్లో ఉంది. దీంతో న్యాయస్థానం పరిధిలో ఉన్న భూమికి సంబంధించి అనంతర కాలంలో రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరిగి ఉంటే.. ఆ సమయంలో కోర్టు ఉత్తర్వులను అధికారులు పరిశీలించారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ›› అప్పటి ఎమ్మార్వో ఎలాంటి ఆధారాలతో పట్టా మార్చారు..?

ఈ వ్యవహారంలో అప్పట్లో విధులు నిర్వహించిన మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) పాత్రపైనా స్పష్టత అవసరమని స్థానికులు కోరుతున్నా రు. పాత రికార్డుల్లో ఒకరి పేరు కొనసాగుతున్న భూమికి అనంతరం పట్టా మార్పు జరిగితే.. ఆ మార్పుకు దరఖా స్తు ఎవరు చేశారు? ఏ పత్రాలను ఆధారంగా సమర్పించారు? పాత రెవెన్యూ రికార్డులను పరిశీలించారా? భూమి వాస్తవ పరిస్థితిపై క్షేత్రస్థాయి విచారణ



నిర్వహించారా? కోర్టులో వివాదం ఉన్న విషయం అధికారుల దృష్టికి వచ్చిందా? అన్న అంశాలు తేలాల్సి ఉంది.

### ›› పట్టా మార్పునకు సంబంధించి అప్పటి ఎమ్మార్వో ఏ ఉత్తర్వులు జారీ చేశారు?

ఆ ఉత్తర్వులకు సంబంధించిన ఫైల్ నోట్, విచారణ నివేదిక, నోటీసులు, సంబంధిత పత్రాలు ప్రస్తుతం రెవెన్యూ కార్యాలయంలో ఉన్నాయా? అన్నదీ అధికారులు వెల్లడించాలని పిటిషణర్ కోరుతున్నారు. కేవలం రికార్డుల్లో పేరు మారినంత మాత్రాన ఆ మార్పు వెనుక ఉన్న పూర్తి ప్రక్రియ స్పష్టమయ్యేది కాదని, సంబంధిత ఫైళ్లను బయటకు తీసి పరిశీలిస్తేనే వాస్తవాలు తేలుతాయని ఆయన అంటున్నారు.

### ›› ఇల్లున్న స్థలానికి వ్యవసాయ పట్టా ఎలా..?

ప్రస్తుతం ఆ భూమిలో ఇళ్లు, ఇతర నిర్మాణాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి స్థలాన్ని ఏ ప్రాతిపదికన వ్యవసాయ భూమిగా పరిగణించారు? పట్టా మార్పు సమయంలో క్షేత్రస్థాయి పరిశీలన జరిగిందా? భూమి వాస్తవ వినియోగాన్ని అధికారులు నమోదు చేశారా? అనే ప్రశ్నలకు సమాధానం కావాలని వారు కోరుతున్నారు.

### ›› పాత పట్టాదారులు.. కొత్త పేర్ల మధ్య సంబంధం ఏమిటి?

పాత యజమానుల పేర్లు, అనంతరం రికార్డుల్లో నమోదైన వ్యక్తుల పేర్లలో ఒకే ఇంటిపేరు కనిపిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే కేవలం ఇంటిపేరు ఒకటిగా ఉన్నంత మాత్రాన కుటుంబ లేదా వారసత్వ సంబంధం నిర్ధారణ కాదని వారు అంటున్నారు. పాత యజమానులకు, ప్రస్తుత పట్టాదారులకు నిజంగా వారసత్వ సంబంధం ఉందా? ఉంటే దానికి సంబంధించిన వారసత్వ పత్రాలు, కుటుంబ వివరాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఏమిటి? అన్నది అధికారికంగా తేల్చాల్సి ఉంది.

### ›› సర్వే నంబరుపైనా స్పష్టత అవసరం..



ఈ భూమికి సంబంధించి సర్వే నంబర్ విషయంలోనూ స్పష్టత అవసరమని స్థానికులు చెబుతున్నారు. రికార్డుల్లో ఏదైనా మార్పు లేదా తప్పిదం జరిగిందా? అన్నది సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

### ›› పట్టా మార్పు ఫైళ్లు బయటపెట్టాలి..

పట్టా మార్పు కోసం సమర్పించిన దరఖాస్తు, దానికి జత చేసిన ఆధారాలు, అప్పటి ఎమ్మార్వో చేసిన విచారణ, సంబంధిత అధికారుల నివేదికలు, జారీ చేసిన ఉత్తర్వులు, పాత రెవెన్యూ రికార్డులు అన్నింటినీ పరిశీలించాలని బాధ్యులు కోరుతున్నారు. ముఖ్యంగా కోర్టు వివాదం కొనసాగుతున్న సమయంలో లేదా అనంతరం పట్టా మార్పు జరిగి ఉంటే.. న్యాయస్థానం ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకున్నారా? అనే అంశాన్ని కూడా విచారణలో భాగంగా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

### ›› రికార్డులు పరిశీలించి వాస్తవాలు తేల్చాలి..

1954 నాటి కొనుగోలు పత్రం నుంచి ప్రస్తుత రెవెన్యూ రికార్డుల వరకు, పాత పట్టా/అనుభవదారు వివరాలు, 1960లో పంచాయతీ ఇచ్చిన అనుమతి, భూమి వర్గీకరణ, 2018 కోర్టు కేసు, తాత్కాలిక ఇంజంక్షన్ ఉత్తర్వులు, అనంతరం జరిగిన పట్టా మార్పులకు సంబంధించిన ఫైళ్లను సమగ్రంగా పరిశీలించాలని బాధ్యులు కోరుతున్నారు.

### ›› అప్పటి ఎమ్మార్వో ఎలాంటి ఆధారాలతో పట్టా మార్పు చేశారు?

ఆ సమయంలో ఎలాంటి విచారణ జరిగింది? పాత రికార్డులను పరిశీలించారా? కోర్టు కేసు వివరాలు తెలుసా? అన్న ప్రశ్నలకు అధికారిక రికార్డుల ఆధారంగా సమాధానం ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పాత రికార్డుల నుంచి ప్రస్తుత పట్టాల వరకు సమగ్ర విచారణ చేపట్టి, పట్టా మార్పు ప్రక్రియలో నిబంధనలు పాటించారా లేదా అన్నది తేల్చాలని సంబంధించిన బాధ్యతలు డిమాండ్ చేస్తున్నారు.

## 6 ఐఈడీలు నిర్వీర్యం



**చర్ల , అక్టోబర్ 6(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని అబుజ్‌మద్ ప్రాంతంలో నారాయణ్‌పూర్ పోలీసులు, 29వ బెటాలియన్ ఐటీబీపీ సంయుక్తంగా చేపట్టిన భారీ గాలింపు చర్యల్లో పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేశారు. భట్‌బెడా ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉంచిన 06 ప్రెషర్ కుక్కర్ ఐఈడీలు, 01 పైప్ బాంబు ఐఈడీని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.పోలీస్ సూపరింటెండెంట్ సందీప్ కుమార్ పటేల్, 29వ బెటాలియన్ ఐటీబీపీ కమాండింగ్ ఆఫీసర్ అభిషేక్ సూద్, అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) అక్షయ్ సబ్ద్రాల మార్గదర్శకత్వంలో అక్టోబర్ 5న సంయుక్త బృందం మక్సోలి–భట్‌బెడా–రైనార్ ప్రాంతంలో గాలింపు చేపట్టింది. రైనార్ క్యాంప్ నుంచి భట్‌బెడా వైపు నిర్వహించిన ఈ తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులను గుర్తించిన బృందం పరిసర ప్రాంతాన్ని పూర్తిగా తనిఖీ చేసింది.ఈ క్రమంలో ఐఈడీలతో పాటు వాటి తయారీలో ఉపయోగించే మల్టీమీటర్, స్క్రూడ్రైవర్, సోల్డరింగ్ వైర్, సోల్డరింగ్ ఐరన్, మూడు వాహనాల తాళాలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను బాంబ్ డిస్పోజల్, నిర్వీర్య బృందం అవసరమైన భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అక్కడికక్కడే సురక్షితంగా ధ్వంసం చేసింది. ఈ బృందానికి ఏఎస్ఐ మోహన్ నాయకత్వం వహించారు. అబుజ్‌మద్ ప్రాంతంలో భద్రతా దళాలు నిరంతరం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని అధికారులు తెలిపారు. పేలుడు పదార్థాలు, అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉంటూ సంయుక్తంగా చేపడుతున్న చర్యలతో ఆ ప్రాంతంలో భద్రతను మరింత పటిష్టం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## వార్డు మెంబర్ల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడిగా దారా రమేష్






**దమ్మపేట,అక్టోబర్.06 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరం అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా దమ్మపేట గ్రామపంచాయతీ 14వ వార్డు సభ్యుడు దారా రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అధ్యక్షురాలు నక్క లక్ష్మీ ఆదేశాల మేరకు నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలోని వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దారా రమేష్ తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు జిల్లా, రాష్ట్ర స్థాయి ఫోరం నాయకులతో సమన్వయం చేసి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్, జిల్లా అధ్యక్షురాలు నక్క లక్ష్మీ, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దారా రమేష్ నియామకం పట్ల దమ్మపేట మండల ప్రజలు, వార్డు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మూడు రోజుల జైలు

**ముంకలపల్లి, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి ):** మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించిందని స్థానిక ఎస్సై మధుప్రసాద్ తెలిపారు. మండల పరిధిలో పోలీసులు నిర్వహిస్తున్న ప్రత్యేక వాహన తనిఖీల్లో భాగంగా గత నెల 18న తనిఖీలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనం నడుపుతూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన కొత్తగూడెం న్యాయస్థానం మంగళవారం నిందితుడికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. ఈ సందర్భంగా ఎస్సై మధుప్రసాద్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలతోపాటు ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు. వాహనదారులు మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.

## కోయ, గోండు భాషలకు గుర్తింపు కల్పించాలి - తాటి వెంకటేశ్వర్లు



**దమ్మపేట,అక్టోబర్.06 (ప్రజాజ్యోతి):**కోయ, గోండు భాషలకు రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏలో నిర్వహించిన భాషా వర్క్‌షాప్ ప్రతినిధులు కోరారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు కార్యక్రమానికి హాజరయ్యారు.కోయ, గోండు భాషల్లోని పదాలు, ఉచ్చారణలు, పదప్రయోగాలను సేకరించి ప్రామాణీకరించడంతోపాటు సమగ్ర నిఘంటువు రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు తెలిపారు. ఆదివాసీ భాషలు, సంస్కృతులను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా భాషలకు రాజ్యాంగబద్ధ గుర్తింపు కల్పించేలా రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని కోరుతూ తాటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్ లో సంబంధిత బిల్లు ప్రవేశపెట్టేలా కృషి చేయాలని కోరారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, అస్సాం తదితర రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొని ఆదివాసీ భాషల పరిరక్షణ, ప్రామాణీకరణపై చర్చించారు.

## దోమల వ్యాధుల కట్టడికి అప్రమత్తతే ఆయుధం

- **క్యాన్సర్ ను తొలిదశలో గుర్తించేలా ప్రజలకు అవగాహన కల్పించాలి: డీఎంహెచ్ఓ డా. తుకారాం రాథోడ్**

**బూర్గంపహాడ్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):**దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణతో పాటు క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ ఓ) డా.తుకారాం రాథోడ్ సూచించారు. మంగళవారం మోరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే సమావేశానికి ఆయన హాజరై ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ ఓ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమల వృద్ధికి అవకాశం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఇళ్ల చుట్టుపక్కల,ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.డెంగ్యూ, మలేరియా,ఫైలేరియా,చికున్ గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.గ్రామాల్లో జ్వరం,ఇతర అనుమానాస్పద లక్షణాలతో బాధపడుతున్న వారిని ఆశా కార్యకర్తలు,ఆరోగ్య సిబ్బంది గుర్తించి వెంటనే వైద్య పరీక్షలు చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.అదేవిధంగా నోటి,స్తన,సర్వైకల్ తదితర క్యాన్సర్లను తొలిదశలోనే గుర్తించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని డా.తుకారాం రాథోడ్ సూచించారు.ప్రారంభ దశలో గుర్తించి తగిన వైద్యం అందిస్తే క్యాన్సర్ ను నియంత్రించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు.ముఖ్యంగా మహిళలు స్తన, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించిన అనుమానాస్పద లక్షణాలపై అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. పొగాకు, గుట్కా, ధూమపానం వంటి హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండేలా యువతతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు.ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ దోమల వ్యాధుల నివారణ,క్యాన్సర్ స్క్రీనింగ్, పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్ ఓ సూచించారు.ఈ కార్యక్రమంలో పీహెచ్ సీ వైద్యాధికారి డా. నగేష్, సూపర్ వైజర్లు, ఎంపీహెచ్ ఏలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నక్సలైట్ల డంప్ గుర్తింపు

- **భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం**

**చర్ల ,అక్టోబర్ 6(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని దంతెవాడలో నక్సలైట్లు అడవుల్లో దాచిన భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల డంప్‌ను దంతేవాడ పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు. బార్సూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగనార్, బుర్దుమ్, తోడ్మా, కోహ్కాబేడా అటవీ-కొండ ప్రాంతాల్లో అక్టోబ ర్ 5న చేపట్టిన ఏరియా డామినేషన్, గాలింపు చర్యల్లో ఈ డంప్‌ను గుర్తించారు. లొంగిపోయిన నక్సలైట్ల నుంచి అందిన కీలక సమాచారంతో జిల్లా బలగాలు, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్ సంయుక్త బృందం ఈ ఆపరేషన్ నిర్వహించింది. అక్టోబర్ 6న ఉదయం సుమారు 6.30 గంటలకు కోహ్కా బేడా, బుర్దుమ్ గ్రామాల మధ్య అడవులు, కొండ ప్రాంతాల్లో గాలింపు చేపట్టగా నక్సలైట్లు గతంలో దాచిన డంప్ బయటపడింది.

### ›› స్వాధీనం చేసుకున్న సామగ్రి

ఏకే-47 రైఫిల్ ఒకటి, ఇన్సాస్ రైఫిల్ ఒకటి, బీజీఎల్ లాంచర్ ఒకటి, .315 బోర్ తుపాకీ ఒకటి, నాటు తుపాకులు ఆరు, బీజీఎల్ సెల్స్ తొమ్మిది, ఏకే-47 రౌండ్లు 23, బీజీఎల్ రౌండ్లు ఐదు, టిఫిన్ బాంబులు రెండు, కుక్కర్ బాంబులు ఎనిమిది, .315 రౌండ్లు 138,



వాకీటాకీ సెట్లు 20, తీర్ బాంబులు రెండు, నక్సల్స్ యూని ఫాం రెండు జతలు, ఇన్సాస్ మ్యాగజైన్ ఒకటి, కార్డెక్స్ వైర్ సుమారు 20మీటర్లు,ఎరుపు-నలుపు వైర్ సుమారు 20 మీటర్లు, పిస్టన్ రాడ్ స్ప్రింగులు 24, మల్టీమీటర్ ఒకటి, ఇన్వర్టర్ ఒకటి, కార్ ఇన్వర్టర్లు రెండు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.బస్తర్ రేంజ్ ఐజీ బద్రీ నారాయణ్ మీనా (ఐపీఎస్), దంతేవాడ సీఆర్పీఎఫ్ రేంజ్ డీఐజీ (ఆపరేషన్స్), ఎస్పీ చంద్రమోహన్ సింగ్ (ఐపీఎస్), అదనపు ఎస్పీ జితేంద్ర కుమార్ ఖుటే, డీఎస్పీ నసర్ ఉల్లా సిద్ధిఖీ మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ కొనసాగినట్లు పోలీసులు తెలిపారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతి, భద్రత, అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించేందుకు ఇలాంటి గాలింపు, ఏరియా డామినేషన్ చర్యలు నిరంతరం కొనసాగిస్తామని దంతేవాడ పోలీసులు తెలియచేసారు.

## భీమునగూడెంలో ప్రత్యేక వైద్య శిబిరం

- **జ్వరాలపై ప్రజలు ఆందోళన చెందవద్దు: డాక్టర్ నాజ్నిన్ తబ్సుమ్**
- **ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించిన వైద్య బృందం**






**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 6, (ప్రజా జ్యోతి):**అన్నపురెడ్డిపల్లి మండలంలోని భీమునగూడెం గ్రామంలో ఓ బాలుడు మృతి చెందిన నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా మలేరియా కార్యక్రమ అధికారి ఆదేశాల మేరకు ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 34 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, ముగ్గురికి సాధారణ జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. అనంతరం వైద్య బృందం గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంది.పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, కాచి చల్లార్చిన నీటిని తాగడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మృతి చెందిన కాకా అఖిల్ మెదడు సంబంధిత వ్యాధితో మృతి చెందినట్లు వైద్యాధికారి డాక్టర్ నాజ్నిన్ తబ్సుమ్ తెలిపారు. గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయనే ప్రచారంలో వాస్తవం లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాలని, అర్హత లేని ఆర్ఎంపీల వద్ద వైద్యం చేయించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, మలేరియా విభాగం అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పామాయిల్ గెలల దొంగల ముఠా అరెస్ట్

- **రాత్రివేళ తోటల్లోకి చొరబడి గెలల చోరీ**
- **ముగ్గురి అరెస్ట్.. ట్రాలీ ఆటో, సెల్‌ఫోన్లు, రూ.20 వేల నగదు స్వాధీనం**




**దమ్మపేట,అక్టోబర్.06 (ప్రజాజ్యోతి):** రాత్రివేళల్లో పామాయిల్ తోటల్లోకి చొరబడి గెలలను నరికి తరలిస్తున్న ముఠా గుట్టును దమ్మపేట పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ట్రాలీ ఆటో, మూడు సెల్‌ఫోన్లు, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మపేటకు చెందిన పిల్లి వెంకటేశ్వరరావు రాత్రివేళల్లో AP 20 TA 9724 నంబరు గల ట్రాలీ ఆటోలో పామాయిల్ తోటల్లోకి వెళ్లి గెలలను నరికి తరలించేవాడు. అనంతరం వాటిని అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో విక్రయించేందుకు పెరుమాళ్ల కుమార్‌బాబు , చిట్లూరి పుల్లారావు సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పార్కలగండి, మొద్దులగూడెం గ్రామ శివారు ప్రాంతాల్లో సెప్టెంబరు 6, 8, 10 తేదీల్లో పామాయిల్ గెలలను చోరీ చేసినట్లు విచారణలో నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన గెలలను ఫ్యాక్టరీలో విక్రయించి వచ్చిన సొమ్మును ముగ్గురూ పంచుకునేవారని పేర్కొన్నారు.చోరీ సొమ్మును నగదుతోపాటు ఫోన్‌పే ద్వారా కూడా బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మూడు సెల్‌ఫోన్లలోని డిజిటల్ లావాదేవీలను పరిశీలిస్తున్నారు. మరిన్ని చోరీ ఘటనలకు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.కేసు ఛేదనలో అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్ఐలు బి. రాజేష్‌కుమార్, డి. బాలస్వామినాథం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన లక్ష్మణ్, రామకృష్ణరెడ్డిలను సీఐ అభినందించారు.

## ఆపదలో అండగా యాదవ సంఘం

**చర్ల, అక్టోబర్ 6(ప్రజాజ్యోతి ):**చర్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన మెంతుల దుర్గ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యారు. అనారోగ్యంతో పాటు కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న యాదవ సంఘం సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించారు.దుర్గ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సంఘం సభ్యులు ఆమె కుటుంబాన్ని పరామర్శించి, నిత్యావసర సరుకులను అందజేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి తమ వంతు సహాయాన్ని అందించి అండగా నిలిచారు. కష్టకాలంలో కుటుంబానికి చేయూతనందించిన యాదవ సంఘం సభ్యులను గ్రామస్థులు అభినందించారు.ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షుడు మెంతుల నరసింహారావు మాట్లాడుతూ అనారోగ్యం, ఆపదల్లో ఉన్న వారికి ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. యాదవ కుటుంబాల్లో ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా అధైర్యపడవద్దని సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గోసుల రవి, కుర్రి జగదీష్, మెంతుల నాగరాజు, మాగంటి నాగబాబు, పంకు వెంకట్, కొప్పుల వెంకటనారాయణ, శ్రీను, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి మత్తులో పాల్వంచ.. యువత భవిష్యత్తు ఎటు?



- విద్యార్థులే టార్గెట్‌గా మత్తు మాఫియా?
- సిగరెట్ దుకాణాల నుంచి గంజాయి వరకు
- వెలుగులోకి రాని చీకటి దందా.
- పట్టుబడినప్పుడు కేసులు.. ఆ తర్వాత పరిస్థితి ఏమిటి?
- నార్కోటిక్స్ నియంత్రణ చర్యలు ఎక్కడ?



**పాల్వంచ, అక్టోబర్ 6, ప్రజాజ్యోతి:**ఒకప్పుడు ప్రశాంతమైన పట్టణంగా పేరున్న పాల్వంచలో మత్తు పదార్థాల వినియోగంపై పెరుగుతున్న చర్చలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో సిగరెట్ అలవాటు పెరగడంతో పాటు గంజాయి వంటి మత్తు పదార్థాలు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేపటి సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన యువతరం మత్తు బారిన పడటం అత్యంత ప్రమాదకర పరిణామమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ›› కాళీ పోతున్న యువతరం.. భవిష్యత్తు ఎటు?

యువత దేశానికి వెన్నెముక. విద్య, ఉద్యోగం, ఉపాధి, సాంకేతికత వైపు దూసుకెళ్లాల్సిన వయసులో కొందరు మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. మొదట సరదాగా మొదలయ్యే సిగరెట్ అలవాటు క్రమంగా ఇతర మత్తు పదార్థాల వైపు నడిపించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి దశలోనే ఇటువంటి అలవాట్లు ఏర్పడితే చదువుపై ప్రభావం పడటమే కాకుండా కుటుంబ సంబంధాలు, ఆరోగ్యం, భవిష్యత్ ఉపాధి అవకాశాలపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు నిపుణులు ఆవేదన చెందుతున్నారు.

### ›› గంజాయి మత్తులో పాల్వంచ?

పాల్వంచలో గంజాయి వినియోగం, సరఫరాపై అప్పుడప్పుడు కేసులు నమోదవుతున్నప్పటికీ అసలు సరఫరా వ్యవస్థ ఎక్కడి నుంచి నడుస్తోంది? వినియోగదారుల వరకు గంజాయి ఎలా చేరుతోంది? దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.పట్టుబడుతున్న చిన్న స్థాయి వినియోగదారుల వరకు మాత్రమే దర్యాప్తు పరిమితమవుతుందా? లేక అసలు సరఫరా గొలుసును ఛేదించే దిశగా దర్యాప్తు సాగుతోందా? అనేది పోలీసులు, సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ›› విద్యార్థులకు సులభంగా లభ్యమవుతోందా?

అత్యంత ఆందోళన కలిగించే అంశం విద్యార్థుల చుట్టూ మత్తు పదార్థాల లభ్యతపై వస్తున్న ఆరోపణలు.కళాశాలలు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉందా? విద్యార్థులను ఎవరు ప్రభావితం చేస్తున్నారు? చిన్న వయసులోనే మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్న వారిని గుర్తించే వ్యవస్థ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.విద్యార్థులకు మత్తు పదార్థాలు చేరకుండా విద్యాసంస్థలు, పోలీసులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

### ›› తల్లిపై అఘాయిత్యం.. నిందితుడు గంజాయి మత్తులో ఉన్నాడనే ఆరోపణలు

ఇటీవల చోటుచేసుకున్న ఓ నేర ఘటనల్లో నిందితుడు గంజాయి మత్తు ప్రభావంలో ఉన్నాడనే ఆరోపణలు వినిపించడం మరింత ఆందోళన కలిగిస్తోంది.అయితే ఏదైనా నేరానికి గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలే ప్రత్యక్ష కారణమని నిర్ధారించాలంటే దర్యాప్తు, వైద్య పరీక్షలు, అధికారిక ఆధారాలు అవసరమని నిపుణులు చెబుతున్నారు.అయినప్పటికీ.. నేరాలు, మత్తు పదార్థాల వినియోగం మధ్య ఏదైనా సంబంధం ఉందా? అనే కోణంలో పోలీసులు కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### ›› సిగరెట్లకు బానిసవుతున్న విద్యార్థిలోకం

గంజాయి గురించి మాట్లాడే ముందు సిగరెట్ వినియోగం పెరుగుతున్న అంశాన్ని కూడా విస్మరించలేం.విద్యార్థులు, యువతకు సిగరెట్లు సులభంగా అందుబాటులో ఉండటం, విద్యాసంస్థల పరిసరాల్లో నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తుల విక్రయం జరుగుతోందా? అనే అంశంపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సి ఉంది.చిన్న వయసులోనే పొగతాగడం అలవాటుగా మారితే.. అదే భవిష్యత్తులో మరింత ప్రమాదకరమైన వ్యసనాలకు దారితీసే అవకాశం ఉందనే ఆందోళన తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

### ›› గుర్తించలేకపోతున్న తల్లిదండ్రులు, కళాశాల ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో ప్రవర్తనలో మార్పులు వచ్చినప్పుడు మొదట గుర్తించాల్సింది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే. కానీ చదువులో ఆసక్తి తగ్గడం, తరచూ బయట తిరగడం, కొత్త స్నేహితుల ప్రభావం, ఆర్థిక అవసరాలు పెరగడం వంటి సంకేతాలను కొన్నిసార్లు పెద్దలు గుర్తించలేకపోతున్నారు.విద్యార్థులను తప్పుబట్టడం కంటే.. వారిలో మార్పుకు కారణం ఏమిటో తెలుసుకుని కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### ›› గంజాయి పట్టివేత కేసులు పాల్వంచలోనే అధికం ఎందుకు?

పాల్వంచ పరిధిలో గంజాయి పట్టివేతకు సంబంధించిన కేసులు నమోదవుతున్న సందర్భంలో అసలు ఈ ప్రాంతం మత్తు పదార్థాల సరఫరాకు ఎందుకు అనుకూలంగా మారుతోంది? అనే ప్రశ్నకు సమాధానం కావాలి. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి ఇక్కడికి వస్తుందా? స్థానికంగా ఎవరైనా సరఫరా చేస్తున్నారా? రవాణా మార్గాలు ఏమిటి? వినియోగదారులు ఎవరనే దానికంటే.. సరఫరాదారులు ఎవరు? అనే అంశంపై దర్యాప్తు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

### ›› వెలుగులోకి రాని గంజాయి రాజ్యం?

పట్టుబడిన కేసులు మాత్రమే బయటకు వస్తున్నాయా? పట్టుబడని కేసులు ఎన్ని? అనే అనుమానం ప్రజల్లో ఉంది.సోషల్ మీడియా, మొబైల్ కమ్యూనికేషన్, రహస్య సరఫరా మార్గాల ద్వారా మత్తు పదార్థాల వ్యాపారం జరుగుతోందా? అనే అంశంపై నిఘా సంస్థలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.ఒక్కో కేసులో చిన్న మొత్తంలో గంజాయి పట్టుకోవడం కంటే దాని వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించడం అత్యంత కీలకం.

### ›› కేవలం సిగరెట్లు అమ్మే దుకాణాలెందుకు?

పట్టణంలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల విక్రయానికే పరిమితమైన చిన్న చిన్న దుకాణాలు కూడా కనిపిస్తుంటే అసలు యువతలో పొగాకు వినియోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయంపై నిబంధనలు పాటిస్తున్నారా? మైనర్లకు విక్రయాలు జరుగుతున్నాయా? దుకాణాలపై అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర తనిఖీలు అవసరం.

### ›› గంజాయి మత్తులో పాల్వంచ యువత?

ప్రతి యువకుడినీ అనుమానించడం సమస్యకు పరిష్కారం కాదు. కానీ మత్తు పదార్థాల వినియోగంపై వస్తున్న ఆరోపణలను పూర్తిగా విస్మరించడం కూడా ప్రమాదకరమేనని ప్రజలు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యువతను నిందితులుగా చూడటం కంటే మత్తు పదార్థాల వైపు వారిని నడిపిస్తున్న మూల కారణాలను గుర్తించాలని కుటుంబ పరిస్థితులు, స్నేహితుల ప్రభావం, నిరుద్యోగం, ఒత్తిడి, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలను కూడా పరిశీలించాలని కొందరు సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు.

### ›› నివారించాల్సిన నార్కోటిక్స్ శాఖ ఎక్కడ?

మత్తు పదార్థాలు పట్టుబడిన తర్వాత కేసు నమోదు చేయడం మాత్రమే సరిపోదు. మత్తు పదార్థాల సరఫరా జరగకుండా ముందస్తు చర్యలు అవసరం.పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో నిఘా, రహస్య సమాచార వ్యవస్థ బలోపేతం, సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు ఇలా సమగ్ర వ్యూహం అవసరం.నార్కోటిక్స్ నియంత్రణకు సంబంధించి సంబంధిత శాఖలు పాల్వంచలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయి? ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని కేసులు నమోదయ్యాయి? అసలు సరఫరా దారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### ›› దొరికినప్పుడు కేసులు.. ఫోటోలకు ఫోజులివ్వడమేనా?

గంజాయి పట్టుబడింది, నిందితులు అరెస్టయ్యారు, కేసు నమోదైంది, ఫోటోలు విడుదలయ్యాయి. ఇంతటితో బాధ్యత పూర్తయిందా?అసలు గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపారు? ఎవరికి సరఫరా చేయాల్సి ఉంది? గతంలో ఎంతకాలంగా ఈ వ్యవహారం సాగుతోంది? దీని వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు వెలుగులోకి రావాలి.చిన్న స్థాయి నిందితులను పట్టుకోవడం కంటే.. అసలు మూలాలను గుర్తించి సరఫరా వ్యవస్థను పూర్తిగా ఛేదించినప్పుడే మత్తు పదార్థాల నియంత్రణ సాధ్యమవుతుంది.

### ›› యువతను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది?

పాల్వంచలో మత్తు పదార్థాల సమస్యపై పోలీసులు, నార్కోటిక్స్ విభాగం, విద్యాశాఖ, కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. గంజాయి పట్టుబడిన తర్వాత చర్యలు తీసుకోవడం ఒక దశ మాత్రమే. గంజాయి యువత చేతికి చేరకుండా అడ్డుకోవడమే అసలు విజయం. యువతను మత్తు నుంచి దూరం చేయడానికి అవగాహన కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నాయి? విద్యాసంస్థల్లో కౌన్సెలింగ్ వ్యవస్థ ఉందా? మైనర్లకు సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? గంజాయి సరఫరా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులను గుర్తించేందుకు ఎలాంటి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.పాల్వంచ యువత భవిష్యత్తు మత్తులో కలిసిపోకుండా.. ఇప్పటికైనా సమగ్ర చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

## రామాలయంలో 12 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- దేవస్థానం ఈవో కే దామోదరరావు

**భద్రాచలం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో కే దామోదరరావు తెలిపారు. స్వామివారి ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, వివిధ అలంకార సేవలు నిర్వహించనున్నారు.మహోత్సవాల్లో భా గంగా ఈ నెల 12న శ్రీ ఆదిలక్ష్మి అలంకారం, 13న శ్రీ సంతానలక్ష్మి, 14న శ్రీ గజలక్ష్మి, 15న శ్రీ ధనలక్ష్మి, 16న శ్రీ ధాన్యలక్ష్మి, 17న శ్రీ విజయలక్ష్మి, 18న శ్రీ ఐశ్వర్యలక్ష్మి, 19న శ్రీ వీరలక్ష్మి, 20న శ్రీ మహాలక్ష్మి, 21న శ్రీ నిజలక్ష్మి అలంకారాల్లో అమ్మ వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.మహోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజ యదశమి సందర్భంగా ఈ నెల 21న ఉదయం సంక్షేప రా మాయణ హవన పూర్ణాహుతి, మహా పుష్పాభిషేకం నిర్వహించనున్నారు. సా యంత్రం ప్రత్యేక పూజలు, ఆయుధ పూజతో పాటు శ్రీ రామలీల మహోత్సవా న్ని నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు.శరన్నవరాత్రి మహోత్సవాల్లో భక్తులు పాల్గొనేందుకు ప్రత్యేక ఉభయ సేవలు ఏర్పాటు చేసినట్లు, . ఒకరోజు ఉభయ సేవకు రూ. 1,000, పది రోజుల ఉభయ సేవకు రూ.10,000 రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈవో కోరారు.

## సెక్షన్ 22-ఏ రద్దు నిర్ణయానికి గాంధీ పథం హర్షం

- ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి చిత్రపటాలకు పూలాభిషేకం



**భద్రాచలం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** సెక్షన్ 22–ఏ రద్దు విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ గాంధీపథం ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలం పట్టణంలోని బీఎస్ఆర్ గార్డెన్స్ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పూలాభిషేకం నిర్వహించారు.అంతర్జాతీయ గాంధీపథం అధ్యక్షులు డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి పిలుపు మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సెక్షన్ 22–ఏ కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు తదితర వ్యవహారాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సెక్షన్ 22–ఏ రద్దు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని, దీనివల్ల అర్హత కలిగిన భూములకు సంబంధించి ప్రజలకు మరింత స్పష్టత, పారదర్శకత, సౌలభ్యం కలిగే అవకాశం ఉందని అన్నారు. రైతులు, సామాన్య ప్రజలకు ఈ నిర్ణయం ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గాంధీపథం తరఫున కృతజ్ఞత లు తె లిపారు. గాంధీపథం భద్రాచలం మండల అధ్యక్షులు గం జి సంపత్, సుమంత్, రాజు, తిరుపతిరావు, వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

## జేఏసీ ఎన్నికల ప్రచార భేరి



**భద్రాచలం, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** భద్రాచలం ఆర్టీసీ డిపోలో జేఏసీ ఆధ్వర్యంలో పోకల సురేష్ నేతృత్వంలో సోమవారం ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన ప్రచారం 10.30 గంటల వరకు కొనసాగింది. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిపో వద్ద గేట్ మీటింగులు నిర్వహించి ఉద్యోగులతో ముఖాముఖి మాట్లాడిన జేఏసీ రాష్ట్ర నాయకులు, ఎన్నికల్లో బస్సు గుర్తు, కాగడా గుర్తులకు ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర నాయకులకు డ్రైవర్లు, కండక్టర్లు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 9న జరిగే ఎన్నికల్లో బస్సు, కాగడా గుర్తులపై ఓట్లు వేసి జేఏసీ అభ్యర్థులను గెలిపిస్తామని కార్మికులు స్పష్టం చేసినట్లు ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ తెలిపింది. ప్రచార కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

# మన ఇసుక వాహనం ఎక్కడ?

- యాప్ ఉంది.. సేవలు మాత్రం అందుబాటులోకి ఎప్పుడు?
- ట్రాక్టర్ ఇసుక ఐదు వేల వరకు.. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం




**దమ్మపేట, అక్టోబర్.06 (ప్రజాజ్యోతి):** ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను పారదర్శకంగా, నిర్ణీత ధరకు ప్రజలకు అందించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన 'మన ఇసుక వాహనం' విధానం దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ట్రాక్టర్ ఇసుకకు సుమారు రూ.5 వేల వరకు చెల్లించాల్సి వస్తోందని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వాపోతున్నారు.

### 2019లో ప్రారంభమైన విధానం

తెలంగాణలో 'మన ఇసుక వాహనం' ను ప్రభుత్వం 2019లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని, ప్రభుత్వ నియంత్రిత ధరకు ఇంటి వద్దకే సరఫరా చేయడం, వాహనాలను ట్రాక్ చేయడం, అక్రమ రవాణాను నియంత్రించడం దీని ప్రధాన ఉద్దేశాలు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కూడా అక్టోబరు 02, 2019 న ఈ విధానం అమల్లోకి వచ్చింది . మొదట్లో జిల్లాలో సుమారు 20 రీచ్ వరకు అందుబాటులో ఉండేవి అయితే కాలక్రమంలో ఇసుక సరఫరా విధానంలో మార్పులు, రీచ్‌ల లభ్యత, బుకింగ్–రవాణా వ్యవస్థలో తలెత్తిన సమస్యల కారణంగా కొన్ని ప్రాం తాల్లో ప్రజలకు ఈ సేవ నిరంతరంగా అందుబాటులో లేకపోవడంపై ఫిర్యాదులు వచ్చాయి. ప్రస్తుతం రెండు మూడు రీచ్ లతో మాత్రమే ఈ యప్ నడుస్తోంది

### మళ్లీ కొత్త విధానంతో ప్రయోగం

2026లో ప్రభుత్వం 'మన ఇసుక వాహనం' విధానాన్ని కొత్త మార్పులతో ముందుకు తీసుకెళ్లింది. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కూపన్ ఆధారిత ఇసుక బుకింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయడం ప్రారంభించింది. బుకింగ్, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను డిజిటల్ విధానంలో నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా అధికారిక యాప్ 2026 ఆగస్టులోనూ అప్‌డేట్ కావడం గమనార్హం. అంటే యాప్ పూర్తిగా రద్దయినట్లు కాకుండా, దాని అమలు విధానంలో మార్పులు జరుగుతున్నట్లు అధికారిక సమాచారం సూచిస్తోంది

### ప్రజలకు మాత్రం ఇసుక భారం

ఇసుక బుకింగ్ విధానం అందుబాటులో ఉన్నప్పుడు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించడం, వాహనాల రాకపోకలను పర్యవేక్షించడం, నిర్ణీత ధరకు ఇసుక అందించడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం స్థానికంగా ఆన్‌లైన్ బుకింగ్ లేదా అధికారిక సరఫరా సులభంగా అందుబాటులో లేకపోతే ప్రజలు ప్రైవేటు ట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది.ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.5 వేల వరకు ఖర్చు అవుతుండటంతో చిన్న ఇళ్లు నిర్మించుకునే కుటుంబాలకు అదనపు ఆర్థిక భారం పడుతోందని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, పేదల గృహ నిర్మాణాలు, మరమ్మతు పనులు చేపట్టే కుటుంబాలకు తక్కువ ధరకు ఇసుక అందుబాటులో ఉండటం అవసరమని కోరుతున్నారు.

### కలెక్టర్ స్పందించాలని వినతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు, గనులు–భూగర్భ వనరుల శాఖ అధికారులు దమ్మపేట–అశ్వారావుపేట ప్రాంతాల్లో మన ఇసుక వాహనం ప్రస్తుత అమలు పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. స్థానికంగా ఏ ఇసుక రీచ్‌ల నుంచి సరఫరా జరుగుతోంది? బుకింగ్ ఎక్కడ చేసుకోవాలి? ట్రాక్టర్‌కు నిర్ణయించిన అధికారిక ధర ఎంత? డెలివరీ ఛార్జీలు ఎంత? కూపన్ విధానం ఎప్పటి నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి వస్తుంది? అనే వివరాలను ప్రజలకు స్పష్టంగా ప్రకటించాలని కోరుతున్నారు. యాప్‌ను కేవలం అందుబాటులో ఉంచడం కాకుండా.. ప్రజలకు నిజంగా ఇసుక అందేలా వ్యవస్థను పటిష్ఠం చేయాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, గనులు–భూగర్భ వనరుల శాఖ అధికారులు స్పందించి, ఇసుక సరఫరాలో పారదర్శకత తీసుకువచ్చి, పేదలకు అందుబాటు ధరలో ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సద్దుల బతుకమ్మకు అన్ని వసతులు కల్పించాలి



**ఇల్లందు, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి)**మున్సిపల్ పరిధిలోని 24 వార్డుల్లో మహిళలకు సద్దుల బతుకమ్మకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మున్సిపల్, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను ఇల్లందు పట్టణంలోని అన్ని వార్డుల్లో మహిళలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఇల్లందు పట్టణంలోని 24 వార్డుల్లోనూ బతుకమ్మ పండుగను మహిళలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారని, ఈ నేపథ్యంలో ప్రతి వార్డులో బతుకమ్మ ఆడే ప్రదేశాలను ముందుగానే గుర్తించి పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ లైటింగ్, పారిశుధ్య ఏర్పాట్లు, అవసరమైన ప్రదేశాల్లో బ్లీచింగ్ తదితర వసతులు కల్పించాలని సూచించారు. బతుకమ్మ ఆడే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్య సిబ్బంది, చెత్త తొలగింపు వంటి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులను కోరారు. అలాగే పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఒకే ప్రదేశంలో చేరే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు కూడా భద్రతా చర్యలు చేపట్టి, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకలు ప్రతి వార్డులో ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో, మహిళలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా జరిగేలా మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## తాత్కాలిక గెస్ట్ ఫ్యాకల్టీ మెరిట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):** ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి సిద్ధం చేసిన తాత్కాలిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. అభ్యర్థులు తమ పేరు, విద్యార్హతలు, మెరిట్, నెట్, సెట్, పీహెచ్‌డీ తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే తగిన ఆధారాలతో అభ్యంతరాలను సమర్పించాలని సూచించారు. అక్టోబర్ 7 వరకు భద్రాచలంలోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఐటీడీఏలో కార్యాలయ పనిదినాల్లో నేరుగా అభ్యంతరాలు సమర్పించాలని తెలిపారు. అభ్యంతరాలకు సంబంధించిన ధ్రువపత్రాల నకళ్లను తప్పనిసరిగా జత చేయాలని, గడువు అనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. అందిన అభ్యంతరాలను పరిశీలించి నియామక నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8500136628 నంబర్‌లో సంప్రదించాలని బి.రాహుల్ సూచించారు.

# "గౌరవం లేని చోట.. ఉండలేను..!"



- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ.. రెండుసార్లు విజయం
- బీఆర్ఎస్‌లో సీనియర్ నేతనైనా ఇప్పటికీ అధికారిక హోదా లేదు..
- "విలువలతో కూడిన రాజకీయమే చేశా.. సాధారణ కార్యకర్తగానే పనిచేశా"
- మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కీలక వ్యాఖ్యలు..
- నియోజకవర్గంలో పెరిగిన రాజకీయ ఉత్కంఠ!



**"నేను ఇప్పటివరకు విలువలతో కూడిన రాజకీయాలే చేశాను. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశాను. రెండుసార్లు గెలిచాను.. రెండుసార్లు ఓడిపోయాను. రాజకీయంగా ఇంత సీనియర్ నాయకుడినైనా ఇప్పటివరకు బీఆర్ఎస్‌లో నాకు అధికారికంగా ఎలాంటి హోదా లేదు. అయినా సాధారణ కార్యకర్తగానే పార్టీ కోసం పనిచేశాను. కానీ గౌరవం లేని చోట నేను ఉండలేను.." అంటూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు చేసిన వ్యాఖ్యలు అశ్వారావుపేట రాజకీయాల్లో సంచలనంగా మారాయి.**

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి / ములకలపల్లి, ప్రజాజ్యోతి

"నేను ఇప్పటివరకు విలువలతో కూడిన రాజకీయాలే చేశాను. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశాను. రెండు సార్లు గెలిచాను.. రెండుసార్లు ఓడిపోయాను. రాజకీయంగా ఇంత సీనియర్ నాయకుడినైనా ఇప్పటివరకు బీఆర్ఎస్‌లో నాకు అధికారికంగా ఎలాంటి హోదా లేదు. అయినా సాధారణ కార్యకర్తగానే పార్టీ కోసం పనిచేశాను. కానీ గౌరవం లేని చోట నేను ఉండలేను.." అంటూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు చేసిన వ్యాఖ్యలు అశ్వారావు పేట రాజకీయాల్లో సంచలనంగా మారాయి. పార్టీకి రాజీనామా చేసే అంశంపై ఆయన కీలక ప్రకటన చేయడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర చర్చ మొదలైంది. తన అనుచరులతో క్షుణ్ణంగా చర్చించిన అనంతరం రెండు రోజుల్లో రాజకీయ భవిష్యత్‌పై స్పష్టమైన నిర్ణయం ప్రకటిస్తానని తాటి వెంకటేశ్వర్లు వెల్లడించారు.

## విలువలతో కూడిన రాజకీయమే నా విధానం!

తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ తాటి వెంకటేశ్వర్లు కీలక వ్యాఖ్యలు చేశారు. "నేను ఇప్పటివరకు విలువలతో కూడిన రాజకీయమే చేశాను. పదవుల కోసం రాజకీయాలు చేయలేదు. ప్రజలతో ఉండటమే నా రాజకీయ విధానం" అని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పోటీ చేసిన తన రాజకీయ ప్రస్థానంలో రెండుసార్లు విజయం సాధించానని, రెండుసార్లు ఓటమి ఎదురైందని తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, కానీ రాజకీయాల్లో తన విలువలను మాత్రం ఎప్పుడూ వదులుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అతనికి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ బీఆర్ఎస్‌లో ఇప్పటివరకు తనకు ఎలాంటి అధికారిక పదవి లేదని తాటి వెంకటేశ్వర్లు చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. "నేను బీఆర్ఎస్‌లో సీనియర్ నాయకుడిని. అయినా ఇప్పటివరకు నాకు పార్టీ పరంగా అధికారిక హోదా లేదు. పదవి లేకపోయినా నేను వెనక్కి తగ్గలేదు. సాధారణ కార్యకర్తగానే పార్టీ కోసం పనిచేశాను" అని ఆయన పేర్కొన్నారు. పార్టీలో పదవి లేకపోయినా కార్యకర్తలతో, ప్రజలతో మమేకమై నిరంతరం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నానని తెలిపారు.

## గౌరవమే ముఖ్యమన్న తాటి!

తన తాజా నిర్ణయానికి సంబంధించి తాటి వెంకటేశ్వర్లు చేసిన "గౌరవం లేని చోట నేను ఉండలేను" అనే వ్యాఖ్య ఇప్పుడు రాజకీయంగా తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం జరిగిన ఒక సంఘటనను ఉదాహరణగా చెబుతూ తన రాజకీయ బలమెంతో చూపించాలని కొందరు కోరగా, తాను వందల మంది కార్యకర్తలతో కలిసి ఒకరిని కలిసేందుకు వెళ్లానని ఆయన తెలిపారు. అయితే అక్కడ తనను మాత్రమే



పైకి రావాలని, తనతో ఒక్కడిగానే మాట్లాడాలని చెప్పినట్లు వివరించారు. "నువ్వు పైకి రా.. నువ్వు ఒక్కడివే పైకి రా.. నీతో మాట్లాడాలి" అని చెప్పినప్పుడు, "నేను నా కార్యకర్తలను, నా ప్రజలను వదిలిపెట్టి ఎలా వెళ్లగలను?" అని తాను స్పష్టం చేసినట్లు తెలిపారు. అయితే ఈ విషయాన్ని బీఆర్ఎస్ అధిష్టానం వరకు తీసుకెళ్లి చెప్పే అవకాశం తనకు లభించలేదని కూడా ఆయన చెబుతున్నారు. దీంతో ఒక పార్టీలో ఇంత సీనియర్ నేతకు ఏమాత్రం గౌరవం ఉందన్న చర్చ కూడా వినిపిస్తోంది. అందుకే పదవి, అధికారాల కంటే రాజకీయాల్లో వ్యక్తిగత గౌరవం, విలువలకు ప్రాధాన్యం ఇస్తాననే సంకేతాన్ని ఆయన వ్యాఖ్యలు ఇస్తున్నాయి. అయితే పార్టీకి రాజీనామా చేయడానికి దారితీసిన పూర్తి కారణాలను ఆయన తన అనుచరులతో చర్చించిన తర్వాతే స్పష్టంగా వెల్లడించే అవకాశం ఉంది.

## బీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా..!

తాజా పరిణామాలకు ముందు వరకు తాటి వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. తన అనుచరులతో కలిసి పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశానికి కూడా అనుచరులతో కలిసి భారీగా తరలివెళ్లారు. అక్టోబర్ 4న రాజుపేట వద్ద కూలిన వంతెన స్థానంలో ప్రత్యామ్నాయ మార్గం కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఇటువంటి సమయంలోనే ఆయన పార్టీకి రాజీనామా చేసే నిర్ణయం ప్రకటించడం నియోజకవర్గ రాజకీయాల్లో



మరింత చర్చకు దారితీసింది.

## కొత్త రాజకీయ సమీకరణాలా?

తాటి వెంకటేశ్వర్లు బీఆర్ఎస్‌ను వీడితే అశ్వారావుపేటలో రాజకీయ సమీకరణాలపై దాని ప్రభావం ఎలా ఉంటుందన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా ఆయనతో ఉన్న అనుచరులు, స్థానిక నాయకులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే ఆయనతో పాటు ఎంతమంది పార్టీని వీడతారు? ఆయన తదుపరి రాజకీయ అడుగు ఏమిటి? అనే అంశాలపై ఇప్పుడే స్పష్టమైన అంచనాకు రాలేమని విశ్లేషకులు అంటున్నారు.. తన అనుచరులతో చర్చించిన తర్వాత రెండు రోజుల్లో తుది నిర్ణయాన్ని వెల్లడిస్తానని తాటి వెంకటేశ్వర్లు ప్రకటించారు. దీంతో ఆయన తదుపరి రాజకీయ అడుగుపై అశ్వారావుపేటలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ.. రెండుసార్లు విజయం.. రెండు సార్లు ఓటమి.. సుదీర్ఘ రాజకీయ అనుభవం.. అయినా అధికారిక పార్టీ హోదా లేకుండానే కార్యకర్తగా కొనసాగిన తాటి.. ఇప్పుడు "గౌరవం లేని చోట ఉండలేను" అని చెప్పడం వెనుక అసలు కారణమేంటి? రెండు రోజుల్లో ఆయన చేయనున్న ప్రకటనతో దీనికి పూర్తి సమాధానం దొరకనుంది.



## ప్రజల మధ్యే రాజకీయ ప్రస్థానం!

తాటి వెంకటేశ్వర్లు అశ్వారావుపేట నియోజకవర్గ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న నాయకుడు. గతంలో బూర్గంపాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన, 2014 ఎన్నికల్లో అశ్వారావుపేట నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తదనంతరం బీఆర్ఎస్‌లో చేరి తెలంగాణ తొలి ట్రైకార్ చైర్మన్‌గా కూడా బాధ్యతలు చేపట్టారు. పదవిలో ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల మధ్య ఉండటానికే ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆయన పలుమార్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో రెండుసార్లు విజయం సాధించడంతో పాటు రెండుసార్లు ఓటమిని కూడా ఎదుర్కొన్న తాటి వెంకటేశ్వర్లు రాజకీయాలకు మాత్రం ఏనాడూ దూరం కాలేదు. ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలపై స్పందిస్తూ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయన, అనంతరం తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చారు. తిరిగి పార్టీ గూటికి చేరిన తర్వాత కూడా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ కార్యకర్తలతో కలిసి పనిచేశారు.